
క్షమ
ముప్పాళ రంగనాయకమ్మ

దూరంనుంచే విన్పించింది చిరంజీవి ఏడుపు. చదువుతోన్న పేపరు వదిలేసి గబగబా గదిలోంచి బయటికొచ్చాడు వెంకట్రావు. తండ్రిని చూచిన చిరంజీవి బావురుమంటూ కాళ్లకి చుట్టుకుపోయాడు. దడదడలాడుతోన్న గుండెలతో కొడుకునిలేవదీస్తూ "ఏమైందమ్మా? ఎందుకేడుస్తున్నావు? ఛ! అలాఏడవచ్చునా?" అంటూ వీపునిమురుతూ బుజ్జగించాడు. చిరంజీవి చెప్పలేక చెప్పలేక వెక్కిళ్ళమధ్య "నన్ను కుంటి ..కుంటి...అంటూ వెక్కిరిస్తున్నారు వాళ్లంతా..." అంటూ వీధిలో గోలగా ఆడుకుంటోన్న పిల్లలకేసి చూపించాడు. ఒక్క క్షణం...వెంకట్రావు...మాట్లాడలేకపోయాడు.

"సీతని...నాజట్టు వుండద్దని...వాళ్లన్నయ్య తీసికెళ్లిపోయాడు నాన్నా!" ఏడుస్తూనే అన్నాడు చిరంజీవి.

"బాబూ!" అంటూ వెంకట్రావు కొడుకుని గాఢంగా హత్తుకున్నాడు. చిరంజీవి కొంచెం తేరుకుని తండ్రి మొహంలోకి అమాయకంగా చూశాడు. తండ్రి దగ్గర ఏమంత చనువులేని చిరంజీవికుంటివాడయ్యాకే అంత చేరువయ్యాడు. తండ్రి మొహంలోకి తదేకంగా చూస్తూ అడిగాడు — "నాన్నా! నేను నిజంగా కుంటివాడినేనా నాన్నా?"

ఆ అమాయకత్వాన్ని భరించలేకపోయాడు వెంకట్రావు. "చిరంజీవీ!" అన్నాడు బాధగా. అతని కంఠం గాద్గదికమైంది.

"నువ్వు ... కుంటివాడివికాదు నాన్నా!"

"మరి నా కాలూ, చెయ్యీ వంకరగా యిలా అయిపోయాయేం?"

"లేదమ్మా! ఫర్వాలేదు. మళ్లా మామూలుగానే అయిపోతాయి."

"ఎప్పుడు నాన్నా? నిజంగానా?" చిరంజీవి ముఖం ఒక ఆశాజ్యోతే అయింది—"నేను గోపీవాళ్లలాగా ..బాగా పరుగెత్తలేక పోతున్నానునాన్నా!" అంటూనే ఆ మొహంనిండా నిరాశ అలముకుంది.

"లేదమ్మా! నిన్నింకా పెద్దడాక్టరు గారికి చూపిస్తానుగా? నీ కాలూ, చెయ్యీ పూర్తిగా బాగైపోతాయి. అప్పు డెందుకు పరిగెత్తలేవు? గోపీకన్నా బాగా పరిగెత్తుతావు."

"రాముకన్నా...?"

"ఆఁ రాముకన్నా...వేణూకన్నా..."

"ఛీ! వేణూ అస్సలు బాగా పరిగెత్తడు నాన్నా!"

"పోనీ అందరికన్నా నువ్వే బాగా పరిగెత్తుతావు."

"మరి నా కొత్తజోళ్లుకూడా వేసుకుంటాను కదూ?"

"ఎందుకు వేసుకోవు? ఇంకా చాలారకాల జోళ్లుకొంటాను. అవన్నీ తొడుక్కుంటావు."

"నేను సైకిల్ తొక్కలేనా నాన్నా? సావిత్రి అంటోంది."

"ఉత్తది. అలాంటి మాటలు నువ్వు నమ్మనే వద్దు. నువ్వు సైకిల్ తొక్కుతావు. నీ బుల్లికారు నువ్వు స్వయంగా నడుపుకుంటావు.

"కారెక్కడిది నాన్నా? నాకు లేదుగా?"

"కొనుక్కుంటావునాన్నా! పెద్దవాడివౌతావు. పెద్దచదువు చదువుకుంటావు. పెద్ద ఉద్యోగం వస్తుంది. అప్పుడు చక్కని బుల్లికారు కొనుక్కుంటావు."

"నాకు పెద్దకారే కావాలినాన్నా!"

"పోనీఅలాగే! పెద్దకారేకొనుక్కుంటావు." చిరంజీవికి తృప్తికలిగినట్లే అన్పించింది వెంకట్రావుకి. అయినా ఆ తృప్తిలో కొంత వెల్తి వుండిపోయింది—"నాన్నా! అన్నాడు మళ్లా.

"ఏమిటమ్మా?" అంటూ ఆప్యాయంగా అడిగాడు వెంకట్రావు.

"అప్పుడు నాకు పెద్దజొరం వచ్చిందికదూ?

"పెద్దజ్వరం! అప్పుడే పోయిందిగా?"

"అప్పుడేకదూ నా కాలు యిలా అయిపోయింది?"

"అవునమ్మా!"

"జొరంవస్తే కాళ్లూ, చేతులూ ఇలా వంకరగా అయిపోతాయా నాన్నా?"

దానికికూడా—"అవునమ్మా!" అనలేకపోయాడు వెంకట్రావు,

"చెప్పవేం నాన్నా? నా కాలూ చెయ్యీ ఎందుకిలా అయిపోయాయి?"

భరించలేని వేదనతో కొడుకుని గట్టిగా గుండెలకు అదుముకున్నాడు వెంకట్రావు. వెచ్చటి నీటిబొట్లు బుగ్గలమీదపడితే, తెల్లబోతూ అడిగాడు చిరంజీవి—"ఏడుస్తున్నావేం నాన్నా?"

గబగబా కళ్ళు ఒత్తుకుని "లక్ష్మీ!" అంటూ వంటింటికేసి నడిచాడు వెంకట్రావు. లక్ష్మి ఎదురు వచ్చింది—"అదేం? వాణ్ణెత్తుకున్నారు!" అంది.

"కాస్సేపు బాబుని నీ దగ్గర కూర్చోబెట్టుకో లక్ష్మీ! బాగా ఎండతగ్గాక బైటికి తీసికెళ్తాను."

"ఆడుకుంటానని వెళ్లాడుగా. పిల్లలంతా వీధిలో ఆడుకొంటున్నారు కూడానూ."

అంటూ లక్ష్మి కొడుకుని అందుకుని దగ్గర నిలబెట్టుకుంది.

"ఏం ఆడుకుంటాడులెద్దూ! వాళ్ళంతా ఏమోమో అంటారు" అన్నాడు వెంకట్రావు.

"అదేం చాదస్తం? వాళ్ళేం అంటారు? ఏమిరా! వాళ్ళేమన్నారు నిన్ను?"

వెంకట్రావు విసుక్కున్నాడు- "అదిగో, అవన్నీ వాణ్ణడక్కు. మళ్లా ఏడుస్తూ కూర్చుంటాడు. కాసేపు నీ దగ్గర కూర్చో పెట్టుకో;"

అంటూ గబగబా గదిలోకివెళ్ళి కూర్చున్నాడు. పేపరు తీసుకున్నాడు. బొత్తిగా చదవలేకపోయాడు. మనస్సంతా వికలమై పోయింది. ఆరోగ్యంగా, అందంగా...వుండే రెండు కాళ్ళతో లేడికన్నా వేగంగా పరిగెత్త గలిగే చిరంజీవి కుంటివాడయ్యాడు.

భగవంతుడు వాణ్ణి చక్కటి అవయవాలు యిచ్చి ఏ లోటూ లేకుండానే పుట్టించాడు. కానీ...కానీ... వాడు అవిటివాడై పోయాడు.

"నేను జోళ్ళు వేసుకుంటా నాన్నా?"


"గోపీకన్నా బాగా పరుగెత్తుతాకదూ నాన్నా! ...నేను పెద్దవాణ్ణయాక సైకిలు తొక్కలేనా నాన్నా?"

భగవంతుడా! యింత సహజమైన కోరికలు చిరంజీవి కెంత అసంభవమై పోయాయి!"

చిరంజీవి మాటలు వెంకట్రావు గుండెల్లో ప్రతిధ్వనిస్తోంటే వెంకట్రావు కళ్ళు రెండూ మూసుకొని వెనక్కి వాలిపోయాడు - ఏం చెప్తాడీ నాన్న?! ఏం చెప్పగలడు తను?

* * *

ఎన్నోసార్లు కళ్ళముందు కదలాడే గతం



మరోసారి తిరుగాడింది. ఆరోజు సుమారు... ఖురవై రోజులక్రింద ... వెంకట్రావు అకారణంగా ఆఫీసరు కోపానికి గురై - హెచ్చరికలు చేయించుకొని అభిమానంతో వుడుకుతూ ఇంటి ముఖం పట్టాడు. పది బారలు నడిచేసరికి-

"వెంకట్రావుగారూ!" అన్న పిలుపైతే వినబడిందేగానీ వెంకట్రావు ముందుకే నడిచాడు. "ఎంతమంది వెంకట్రావులు లేరు గనుక?" అనుకుంటూ-

"బాబూ వెంకట్రావుగారూ! మిమ్మల్నే నండీ!" అంటూ ఆ పిలుపు వెంకట్రావునే వెన్నాడింది.

విసురుగా పోతున్న వెంకట్రావు చిరాగ్గా వెనక్కి తిరిగి చూశాడు. రానినవ్వు తెచ్చుకొని "ఏమిటండీ మాస్టారూ! నన్నుగాని పిల్చారా?" అన్నాడు.

"అవును బాబూ! కాస్త ఖాళీ చూసుకుని మీ యింటికైనా రావాలనుకున్నాను" అన్నారు మేష్టారు దగ్గిరికి వస్తూ.

"ఏమిటిమాస్టారూ? నాతో ఏమైనా అవసరం వుందంటారా?" వినయంగానే అడిగాడు వెంకట్రావు.

"అహా! మరేమీ అవసరం కాదు బాబూ! చిరంజీవి మాట చెప్పాలని..."

"చిరంజీవి మాటా!... అంటే మా చిరంజీవే కదండీ?"

"వాడే బాబూ? కాస్త మీరు కూడా యింటి దగ్గిర శ్రద్ధ చేస్తూ వుండాలి."

"ఏమైంది మాస్టారూ; వాడేమైనా చేశాడంటారా?"

"అబ్బే! ఏమోచేశాడనికాదు, బొత్తిగా వంటబట్టి చదవటంలేదు. ఎంతసేపూ అల్లరీ - పక్క పిల్లల్తో పేచీలూ-బెత్తానికి కూడా లొంగకుండా తయారౌతున్నాడు బాబూ! అప్పుడప్పుడూ నన్ను కూడా అటలు పట్టిస్తోంటే... ఆహా! నాకేమో చిన్నతనం అని కాదు. పిల్లవాడు బొత్తిగా అకతాయి పెధవౌతోంటే" ...మాష్టారి మాటలకి అడ్డు తగిలాడు వెంకట్రావు-"సరే మాష్టారూ! నేను చూస్తాను..." అన్నాడు దృఢంగా.

"వాడి తల్లితో కూడా కాస్త శ్రద్ధ చెయ్యమని చెప్పు బాబూ!" "అలాగే" అనేసి ముందుకు నడిచాడు వెంకట్రావు.

కొడుకుమీద వెంకట్రావుకి చాలా కోపం వచ్చింది. మాష్టారు అంత గోల పెడుతూ చెప్పారంటే వాడు చాలా అల్లరి నేర్చాడన్న మాటే! లేకపోతే మాష్టా రెందుకు లేని విషయాలు కల్పించి చెప్తారు?

* * *

ఇంటికి వస్తూనే అడిగాడు వెంకట్రావు-

"లక్ష్మీ! చిరంజీవి యింట్లో వున్నాడా?"

"ఇలాంటి సమయంలో వాడు యింట్లో వుండటంకూడానా? ఏం? వాడి కబురెందుకూ?" అంటూ వచ్చింది లక్ష్మి.

"దార్లో కనబడి వాళ్ళ మాష్టారేం చెప్పారో తెల్సా! వీడు బొత్తిగా చదువు, సంధ్యలు లేకుండా పెధవలా తయారౌతున్నాడట. కొట్టినా జడియటంలేదట. పైగా మేష్టారికే పంగనామాలు..."

మధ్యలోనే అంది లక్ష్మి- "ఆ కబురు నేనుమాత్రం ఎన్నిసార్లు చెప్పలేదు-మీకు? ఎంత చక్కగా చదువుకోవాలి? నా మాట వింటాడా ఏమన్నానా? ఎంతైనా మగ పిల్లలకి తండ్రిభయం, ఆడపిల్లలకి తల్లిభయం వుండాలి. అప్పుడే బాగుపడతారు వాళ్ళు. వాడేం చదువుతున్నాడో... ఎలా చదువుతున్నాడో యెన్నడైనా పట్టించుకున్న పాపాన పోయారూ?" అంది ఎత్తిపొడుపుగా.

"సరే! జరిగిందానికెందుకూ? వాణ్ణిలా పిలు..." లక్ష్మి వీధిగుమ్మంకేసి నడిచింది. గోలగోలగా ఆడుకొంటున్న పిల్లల మధ్య కొడుకుని వెదుకుతూ నిలబడింది. వెంకట్రావు బట్టలు మార్చుకొని కాళ్ళు కడుక్కొని వచ్చి కూర్చున్నాడు. తల్లి సైగతో పరిగెట్టుకుంటూ వచ్చిన చిరంజీవి పకపకా నవ్వుతూ "అమ్మా! అమ్మా! నేను జోరుగా పరిగెడుతోంటే నన్ను పట్టుకోలేక సీత బోర్లాపడిందే! భలే పడిందే!" అంటూ పగలబడి నవ్వాడు.

"ఒరేయ్! ఇలారా!" దాదాపు గర్జించాడు. వెంకట్రావు - "పెధవనవ్వు ఆపి నీ పలకా,

బలపం, పుస్తకాలూ అవీ తెచ్చుకో" తెల్లబోయాడు చిరంజీవి.

"ఏంరా? అలా నించున్నావు? అర్థం కావటంలా? తమరు చాలా గొప్పగా చదువు వెలగబెడుతున్నారని మీ పంతులుగారుచెప్పార్లే. మీ పాండిత్యం చూసి సంతోషిద్దామని... కదలవేం?" అంటూ హుంకరించాడు మళ్ళా.

చిరంజీవి భయంగా చూశాడు తల్లికేసి.

లక్ష్మి పుస్తకాల సంచి తెచ్చి అందించింది—

—"ఫర్వాలేదులే. చదువుకో" అనేసి వంటింటికేసి వెళ్ళిపోయింది.

చిరంజీవి నిస్సహాయుడై సంచీ ముందు వేసుకుని కూర్చున్నాడు. తండ్రి దగ్గర వాడి కెక్కువ చనువులేదు. పేచీపెట్టటానికీ, మారాం చెయ్యటానికీనూ- బిక్కమొహంవేసుక్కూర్చున్న కొడుకుని చూస్తోంటే వెంకట్రావుకి జాలివెయ్యలేదు. పిల్లలుచాలా క్రమశిక్షణతో పెరగాలనిఅతని అభిప్రాయం. పెద్దల్నీ, మాష్టార్నీ గౌరవించాలి తెలివితేటలతో చదువుకోవాలి, నియమం ప్రకారం ఆడుకోవాలి, అతిగాకుండా అల్లరి చెయ్యాలి, మంచి- మంచి అలవాట్లు నేర్చుకోవాలి. అలా పెరిగిన పిల్లలకు గొప్ప భవిష్యత్తు వుంటుందనికూడా అతని నమ్మకం. కొడుకు అలాగే పెరుగుతున్నాడని యిన్నాళ్ళుగా నమ్ముతూ వచ్చాడు వెంకట్రావు. అదంతా అబద్ధం అనుకుంటే నిజంగా మతిపోయినట్టే అయింది వెంకట్రావుకి.

"ఎందుకలా చూస్తావ్. గుణింతాలన్నీ రాయి" ఆజ్ఞాపిస్తున్నట్టే అన్నాడు. చిరాగ్గా ఏదో పుస్తకం తిరగేస్తూకూర్చున్నాడు. పావుగంట గడిచిపోయింది - "రాశావా?" అంటూ పలకచూసిన వెంకట్రావు తెల్లబోయాడు. పలకంతా ఖాళీ!

"ఏం? ఎందుకు రాయలేదు?" అంటూ గద్దించాడు.

చిరంజీవి వణికిపోతూ అన్నాడు-"రావు నాన్నా!"

వెంకట్రావు తీక్షణంగా చూశాడు. కొంత వరకూ తనను తను అదుపులో పెట్టుకున్నాడు.

"సరే! డిక్టేషన్ రాయి" అంటూ చాలా తేలికైన మాటలేవో పదివరకూ చెప్పాడు.



## రచయితలకు మనవి

జయశ్రీ పత్రికకు రచనలు పంపగోరువారు ఈక్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాం.

1. రచనలు కాగితానికి ఒకవైపునే సిరాతో రాసిపంపాలి.

2. కార్టూన్లు, రేఖా చిత్రాలు ఇండియన్ ఇంక్ తో గీసినవి పంపాలి.

3. తమ రచనలు, కార్టూన్లు త్రిప్పి పంపగోరువారు తగినంత పోస్టేజి జతపరచి పంపాలి. పోస్టేజి లేని రచనలు త్రిప్పి పంపడంగాని, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికి గాని అవకాశంలేదు.

పలకమీద కెక్కినవే నాలుగు! అందులో మూడు తప్పులు! మళ్లా కొడుకు మొహంలోకి కోపంగా చూశాడు వెంకట్రావు-"సరే! లెక్కలేమైనా వచ్చునా?"

అడ్డంగా తలతిప్పాడు చిరంజీవి.

"ఊఁ పోనీ అంకెలయినావచ్చునా? ఏదో? వింటాను. ఇరవైవరకూ అప్పగించు" అన్నాడు బిగుసుకు పోతోన్న కంఠం పెగిలించుకొని. "ఒకటీ, రెండూ" అంటూ ప్రారంభించిన చిరంజీవి ఏడు దగ్గర ఆగిపోయి ఏడుపు మొహం పెట్టాడు.

"ఇక రావా?"

"ఊఁ హూఁ" అన్నాడు భయంగానే.

"నిన్న బళ్ళో వేసి సంవత్సరందాటిపోయింది. ఇప్పటికి నీకు రవ్వంత చదువు కూడా అంటలేదు. ఇంతకాలం నువ్వేం చేసినట్టు?"

నిలదీశాడు వెంకట్రావు-మీ పంతులుగారు సరిగ్గా చెప్పటంలేదా?...అలా గొట్టెలా తల ఆడించటంకాదు. నోరు తెరచి మాట్లాడు. ఇంట్లో అమ్మ చెప్తోందికదూ? మరెందుకింత బండ వెధవ్వయ్యావు? చెప్పు సరిగ్గా చెప్పు. నీకు చదువుకోవాలని లేదుకదూ? లేదుకదూ?" అంటూ రెట్టించాడు.

"లేదు నాన్నా!" భయం భయంగానే అన్నాడు చిరంజీవి.

"మరి...మరి... ఆడుకోవాలనుందికదూ? గంతులెయ్యాలని వుందికదూ? చెప్పవేం?"

"అవున్నాన్నా?"

వెంకట్రావుకి కోపం ఆగలేదు. చేతిలో వున్న ఇనుప కమ్మీల పలకతో చిరంజీవి నెత్తిమీద బలంకొద్దీ కొట్టాడు.

కెవ్వుమన్నాడు చిరంజీవి! పలకముక్కలు జలజలా రాలిపడ్డాయి.

వెంకట్రావు కోపం ఇనుమడించింది.

"చదువు సంధ్యలు మానేసి అడుక్కుతింటావు కదూ? రౌడీవెధవా? గంతులెయ్యాలని వుందా?" అంటూ ఛెళ్లు ఛెళ్లున చెంపలు వాయించాడు. కోపంతీరక జుట్టు పట్టుకుని వూపుతూ వీపుమీద చరుపులెట్టాడు. ఘొల్లుమంటూ ఏడుస్తోన్న వాణ్ణి చిట్టచివరకు కిక్కురు మనకుండా నోరు మూయించాడు.

"అదేవిటండీ? వాణ్ణి కొడుతున్నారా?" అంటూపరుగెత్తుకువచ్చిన లక్ష్మికిసంగతేమిటో తెలియలేదు — "దొడ్లో బామ్మగారితో మాట్లాడుతోంటే వాడు ఘొల్లుమన్నట్టు వినిపించింది" అంది కొడుకుకేసి చూస్తూ.

"ఇక చాల్లే చదువు. పోఁ!" అంటూ అరిచాడు వెంకట్రావు. చిరంజీవి తల్లి ఒడిలో మొహం పెట్టుకుని కుళ్ళికుళ్ళి ఏడ్చాడు.

* * *

అర్ధరాత్రి నిద్రలోంచి కెవ్వుమంటూ లేచాడు చిరంజీవి. "ఏమిట్రా? ఏమైంది?" అంటూ దగ్గిరికి వెళ్ళి వాడి ఒంటిమీద చెయ్యివేసి వులిక్కిపడింది లక్ష్మి. అప్పటికప్పుడు థర్మామీటరు తీసి చూసింది. నూటరెండు పైన. లక్ష్మి గుండెలు దడదడ లాడాయి.

"అబ్బాయి ఒళ్ళు జ్వరంతో పేలిపోతోందండీ!" అంది భర్త నుద్దేశించి. వెంకట్రావు సమాధానం చెప్పలేదు.

మర్నాడుమాత్రం డాక్టర్ని తీసుకరాక

తప్పలేదు. నాలుగు రోజులు తీవ్రంగా కాసింది జ్వరం. వాదాపు ఒళ్ళెరగని స్థితిలోనే పడి వున్నాడు చిరంజీవి. మందుగ్లాసు పట్టుకోబోయి వదిలేశాడు-"అమ్మా ! యీ చెయ్యి నొప్పెడుతోందమ్మా !"అన్నాడు దీనంగా చూస్తూ. లక్ష్మి పక్క సర్దుతానంటే లేవబోయి-"ఈ కాలు కూడా నొప్పెడుతోందమ్మా!" అన్నాడు బాధగా.

ఆ తెల్లవార్లూ లక్ష్మి చిరంజీవికి కాలూ, చెయ్యీ నిమురుతూనే కూర్చుంది. ఆ సంగతి వెంకట్రావుకి చెప్పింది. వెంకట్రావు డాక్టర్‌కి చెప్పాడు. డాక్టర్ చిరంజీవికి ఎక్సరేలు తీశాడు. చివరకు తేల్చిచెప్పాడు... "అబ్బాయికి తల మీద యేదో దెబ్బతగిలింది. ఎడంవైపు నరాలు దెబ్బతిన్నాయి. కుడిభాగానికి వాతం వస్తుంది. అందుకే కాలూ...చెయ్యీ..."

"డాక్టర్ !" అదిరిపడ్డాడు వెంకట్రావు.

"దెబ్బ ! దెబ్బ, వాడికేం దెబ్బ తగుల్తుంది. డాక్టర్" అన్నాడు కంగారుగా.

"చిన్నపిల్లలకి ఎన్ని దెబ్బలు తగుల్తాయో యెలా చెప్పగలం ? కాని ... పూర్ ఫెలో !" అంటూ సానుభూతి జూపించాడు డాక్టర్.


"అలా అనకండి డాక్టర్ ! వాడికి ... మా అబ్బాయికి మీరు వైద్యం చేసి బాగుచెయ్యలేరా?" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"తప్పకుండా ప్రయత్నిస్తాను" అంటూ ఏవేవో కొత్తమందులు రాసియిచ్చాడు.

డాక్టర్ రాసిచ్చిన కొత్త మందులన్నీ వెంకట్రావు తెస్తూనే వున్నాడు. లక్ష్మి కొడుకుచేత తాగిస్తూనే వుంది.

చిరంజీవి కాలూ చెయ్యీ మాత్రం అవిటిగానే వుండి పోయాయి - "అమ్మా అమ్మా ! నా చెయ్యి ఎందుకే యిలా అయింది ?" అంటూ గోల పెట్టాడు చిరంజీవి. వెంకట్రావు మతిపోయినవాడిలా జుట్టు పీక్కున్నాడు. కొడుక్కి జ్వరం వచ్చిన దగ్గర్నుంచీ వెంకట్రావుకి అనుమానంగానే వుంది - దెబ్బల భయంతోనే వాడు జ్వరం పడ్డాడని-అయినా తనని తను వంచించుకుంటూ తిరిగాడు. వాడు ఎప్పటిలా ఆరోగ్యంగా లేచి తిరుగుతాడని. కానీ...వాడు అవిటివాడయ్యాడు. అందుకు కారణం తనే అయ్యాడు. భగవంతుడా ! ఇంతకన్నా ఘోరం వుంటుందా ?

కొడుకు పరిసరాలలోనైనా మసలకుండా తప్పించుకు తిరుగుతోన్న వెంకట్రావు... ఇక తనను తను సముదాయించుకో లేక కొడుకు మంచం దగ్గిరికి వెళ్లాడు. చిరంజీవి మీదికి వంగి ఒణుకుతోన్న పెదవులతో వాడి నుదుటిమీద నెమ్మదిగా ముద్దు పెట్టుకున్నాడు.



మెలకువ వచ్చిన చిరంజీవి తండ్రిని చూచి భయంతో బిగుసుకు పోయాడు. వెంకట్రావు చిరంజీవి చేతిని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా నిమరసాగాడు-

—"నొప్పిగా వుందా నాన్నా?"

భయంతోమాట్లాడలేక పోయాడు చిరంజీవి.

"మాట్లాడమ్మా! నిన్నెప్పుడూ కొట్టను. అస్తమానూ ఎత్తుకుని ఆడిస్తాను. షికారుకి తీసికెళ్తాను. నిజం నాన్నా! నిజంగా నిన్నేమీ అనను" అంటూ కన్నీళ్ళతో కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు-కొడుకుకి తనమీద పూర్తిగా నమ్మకం కల్గేటట్టే తన ప్రవర్తన మార్చుకున్నాడు. చిరంజీవి తండ్రిని రోజుకి రెండుమూడు సార్లయినా అడుగుతూనే వుంటాడు-

"నా కాలూ చెయ్యీ ఎందుకిలా అయిపోయాయి నాన్నా?"

కారణం తెలిస్తే ఏమైపోతాడు చిరంజీవి? లక్ష్మికి కూడా తెలియకుండా దాచుకున్నాడు. ఎన్నాళ్ళీ గుండెల్లో బరువు! ఎన్నాళ్ళీ మనస్సులో బాధ? ఎన్నాళ్ళిలా దాసుకోగలడు? ఊఁహూ! తన వల్లకాదు.

* * *

వెంకట్రావు వులిక్కిపడ్డవాడిలా లేచాడు. బాగా చీకటి పడిపోయింది. "లక్ష్మీ" అంటూ గదిలోంచి బైటికి వచ్చాడు.

"బాబు ఏం చేస్తున్నాడు లక్ష్మీ?" అన్నాడు. తల దువ్వుకొంటూ వచ్చింది లక్ష్మి-"నిద్రపోతున్నాడు. అదేం మీరలా వున్నారు? ఒంట్లో బాగాలేదా!" అంది తేరిపార చూస్తూ.

"నువ్విలా రా లక్ష్మీ!"

లక్ష్మి దగ్గిరికి వచ్చింది.

"బాబు మళ్లా ఏమైనా అన్నాడా?"

"ఊఁహూ! రెండు బిస్కట్లు పెడితే తిని నిద్రపోయాడు" దీర్ఘంగా నిట్టూర్చాడు వెంకట్రావు."వాణ్ణి కుంటివాడని వీధిలోపిల్లలు వెక్కిరించారట. ఏడుస్తూ వచ్చేశాడు..."

లక్ష్మి విచారంగా అంది - "ఇలా జరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. భగవంతుడికి జాలిలేకపోయింది. పసివాడిమీద పగపట్టాడు."

"లక్ష్మీ!" దీనంగా చూశాడు వెంకట్రావు. భర్త మొహంలో అలాంటి దైన్యాన్ని యెన్నడూ చూడలేదు లక్ష్మి-"ఎవరిప్రమేయమూ లేకుండా చిరంజీవిని భగవంతుడే అవిటివాణ్ణి చేస్తే మనం బాధపడాల్సిన అవసరమేలేదు లక్ష్మీ! కానీ...భగవంతుడా ఘోరం చెయ్యలేదు. చెయ్యలేదు లక్ష్మీ!"

"ఏమిటండీ మీ రంటున్నది?" ఆశ్చర్యంగా అంది లక్ష్మి.

"నేను చేశాను. నిజంలక్ష్మీ! చిరంజీవిని నేనే కుంటివాణ్ణి చేశాను. ఆ రోజు...నీకు గుర్తువుందా? వాడికి చదువు చెప్పాలని కూర్చున్నరోజు...కోపం ఆపుకోలేక పలక పెట్టి నెత్తిమీద నా శక్తికొద్దీ కొట్టాను...

కెవ్వుమన్నాడు - నా దెబ్బల భయానికే జ్వరం తెచ్చుకున్నాడు. నేను కొట్టిన దెబ్బలకే తలలో నరాలు దెబ్బతిన్నాయి. అవిటివాడయ్యాడు. "నాన్నా! నా కాలు, చెయ్యి ఎందుకిలా అయిపోయాయి నాన్నా?" అని వాడడుగుతోంటే నేనేం చెప్పను లక్ష్మీ? వాడికెన్ని ఆశలున్నాయి లక్ష్మీ? అవేవీ తీరేవి కావని వాడికెలాచెప్పను లక్ష్మీ?" వెంకట్రావు దాదాపు యేడుస్తూనే లక్ష్మి చేతులు పట్టుకున్నాడు.

"నన్ను క్షమించానను లక్ష్మీ! భగవంతుడు క్షమించడు. నువ్వయినా క్షమించు లక్ష్మీ!"

లక్ష్మి ఎంతోసేపు మాట్లాడలేక పోయింది. చివరికి నిర్లిప్తంగా చూస్తూ అంది—"పసిబిడ్డ భవిష్యత్తు అంధకారమయం చేసినా మిమ్మల్ని క్షమించటానికి నేనెవర్ని? భగవంతుడెవరు?"

"లక్ష్మీ!" అయోమయంగా అన్నాడు వెంకట్రావు.

"క్షమతోనే మీ పాపపంకాన్ని కడుక్కోవాలని చూస్తే...అటువంటి క్షమ చిరంజీవినుంచే లభించాలి మీకు. మిమ్మల్ని క్షమించే శక్తి వాడికే వుంది."

"కాని...కాని...చిరంజీవి క్షమ నాకు లభిస్తుందా లక్ష్మీ, నాకు లభిస్తుందా?" అన్నాడు వెంకట్రావు దీనాతిదీనంగా చూస్తూ.

★